కథ

# ఆదర్శం

మొవ్వ బాబూరావు

మన వెంకటానికి ఇక పెళ్ళి కాదని అటు మిత్ర బృందంతో పాటు ఇటు ఇంటిల్లిపాది తేల్చేసారు.

అందగాడు-స్ఫురద్రూపి, బాగా చదువుకున్న వాడు పైగా బ్యాంక్‌లో పెద్ద ఉద్యోగస్తుడు, పెళ్ళికి కావాల్సిన సకల అర్హతలున్న పెళ్ళికొడుకు. మరి ఇదేం చోద్యం? పెళ్ళెందుకు కావటం లేదు? దానికి ఒక కారణం ఉంది. పెళ్ళి విషయంలో అతనికో ఆదర్శం ఉంది. అదేమిటంటే కట్నం తీసుకోకుండా పిల్ల మెడలో తాళికట్టడం. ఏ రాయి అయితేనేం తల పగలగొట్టుకోవడానికి అన్నట్లు ఈ ఒక్క ఆదర్శమే అతన్ని నిత్య పెళ్ళికొడుకులా అలా నిలబెట్టేస్తోంది.

కాణీ కట్నం కూడా తీసుకోనంటున్నాడంటే అన్ని అర్హతలకన్నా మించిన లోసుగు ఉన్నట్లే అని తేల్చిపారేసారు పెళ్ళికూతుళ్ళ తల్లిదండ్రులు.

తల్లిదండ్రులు, అక్కాచెల్లెళ్ళు, ముసలమ్మలు ఎందరు ఎన్ని విధాలుగా గుండెలు బాదుకున్నా తను నమ్ముకున్న సిద్ధాంతం పైనే నిలబడతానన్నాడు.

ఒకానొక శుభముహూర్తాన వెంకటాయి తల్లి అష్టకష్టాలుపడి రెండు మూడు లీటర్ల కిరోసిన్ సంపాదించి కొడుకుముందే డబ్బా మూత తీసి కిరోసిన్ ఒంటి మీద కుమ్మరించుకోవటానికై తయారైంది.

''కట్నం తీసుకుని పెళ్ళి చేసుకుంటే సరి! లేదా నా చావు ఇదిగో ఇలా ముగుస్తుంది'' అంటూ చేతిలోకి రెండు మూడు చుక్కలు కిరసనాయిల్ని పోసుకుని డిమాన్‌స్ట్రేషన్ చేయటం మొదలెట్టేసరికి వెంకటాయి పిచ్చి చూపులు చూడటం మొదలెట్టాడు.

తల్లితోపాటు ఆవిడ వంశవృక్షం కూడా క్యూలో నిల్చోటం చూసేసరికి వెంకటాయికి ముచ్చెమటలు పోసాయి.

గత్యంతరం లేక ఇంటిల్లిపాది చేతుల్లో ఉన్న కిరసనాయిల డబ్బాలన్నిటినీ తన చేతుల్లోకి తీసుకుని దాన్ని తన ఆదర్శం మీద చల్లి నిప్పంటించాడు. ''ఎవరైతే ఎక్కువ కట్నం ఇస్తారో వాళ్ళమ్మాయినే చేసుకుంటాను'' అని ప్రతిజ్ఞ చేసేసాడు.

పెంట మీద విసిరేసిన పైసాను కూడా వదలకుండా పైసా పైసా కూడబెట్టి కూతురుకి ఎలాగైనా ఓ మంచి సంబంధం చేయాలని ఎన్నాళ్ళనుంచో ఎదురుచూస్తున్న కుటుంబరావు తన కూతురు అరుణని వెంకటానికిచ్చి రంగరంగ వైభవంగా పెళ్ళి చేసి కళ్ళొత్తుకున్నాడు.

★★★

చేతిలో పాలగ్లాసుని పట్టుకుని శోభనం గదిలోకి ప్రవేశించింది అరుణ.

వయస్సులో ఉన్న సొగసుగత్తె. అద్భుతమైన సౌందర్యం. ఆమె ముద్దు మొహంలో ఏదో సమ్మోహనా శక్తి ఉందనుకున్నాడు వెంకటాయి.




సిగ్గుతో అందించిన పాలగ్లాసుని ప్రక్కనపెట్టి ఆమెను దగ్గరకు తీసుకున్నాడు.

అతనెంతో సౌమ్యుడుగాను-మరెంతో ఉదారుడుగాను అనిపించింది ఆమెకు. ''ఏవండీ! మిమ్మల్ని ఈ సమయంలో ఇబ్బంది పెడుతున్నానని ఏమీ అనుకోకపోతే ఒక్క విషయం అడుగుతాను''

''చెప్పు అరుణా'' లాలనగా అన్నాడు వెంకటాయి.

''నా అందం, ఆకర్షణ నా ఆదర్శాలకి ఏవిధంగాను సహాయం చేయలేకపోయాయి. కట్నం తీసుకునే మగాడిని నేను వివాహం చేసుకోదలుచుకోలేదు. కాని..అలా మొండి పట్టు పట్టుకుని భీష్మించుకుని కూర్చుంటే జీవితంలో నాకు పెళ్ళి కాదని తేల్చి చెప్పారు మా వాళ్ళు. అందరికీ నేను నచ్చాను. కాని నా ఆదర్శం ఎవరికీ నచ్చలేదు. కట్నం అనేది అన్ని క్వాలిఫికేషన్ల కన్నా గొప్పదని గ్రహించి నన్ను ఒప్పించి ఈ పెళ్ళి చేసారు మా పెద్దలు. నా ఆదర్శం అలా నీరుగారిపోయింది'' ఒక్కసారి వెంకటం చేతులు అమాంతంగా వెళ్ళి ఆమె భుజాల్ని ఊపాయి.

''అరుణా నువ్వు చెప్పేది నిజమా? నీకూ ఇన్నాళ్ళ వరకు పెళ్ళి కాకపోవడానికి కారణం ఈ కట్నమేనా! అయితే..అయితే మనిద్దరి భావాలు ఒక్కటే నన్నమాట. యువతలో ఎన్ని ఆదర్శాలు ఉన్నా పెద్దలూ, ఈలోకం వాటికి విలువనివ్వక మనకున్న ఆదర్శాలను మంట గలుపుతున్నారు. మనిద్దరం లోకం కోసం ఓడిపోయాం. పెద్దల్ని ఎదిరించలేకపోయాం..'' అతనిలో ఏదో ఉద్రేకం ముంచుకొచ్చింది.

''అరుణా! నేనెంత అదృష్టవంతుడ్ని. నువ్వు నా అర్ధాంగిగా లభించటం నేను చేసుకున్న ఫలం. ఇప్పటికీ మించిపోయిందేమీ లేదు. ఇన్నాళ్ళు ఒంటరిగా పోరాడాం. ఇప్పుడు గెలుపు మనదే. మీదగ్గర్నించి మేము తీసుకున్న కట్నం తాలూకు డబ్బు నేను తిరిగి ఇచ్చేస్తాను. మన ఆదర్శాన్ని లోకానికి చాటి చెబుదాం.'' అతను ధృఢంగా, గర్వంగా చెప్పుకుపోతుంటే వెంకటాయి పెదాలకి తన పెదాలు అడ్డుపెట్టింది అరుణ.

''చెప్పనియ్యి అరుణా ఏం? నేను చెప్పింది నీకు నచ్చలేదా?''

''వద్దండి మీరు అంత ప్రతిజ్ఞ చేయకండి. మనం ఇప్పుడే కదండీ సంసార జీవితంలో అడుగుపెడుతున్నాం. రేపు మన జీవితాలు సుఖమయంగా ఉండాలంటే డబ్బు ఎంత అవసరమో తెలియనిది కాదు. అన్నిటికీ డబ్బే కదండీ ప్రధానం.''

''అరుణా! మరి..మరి..మన ఆదర్శం!''

''పెళ్ళయిపోయింది కదండీ..అయిపోయిన పెళ్ళికి బాజాభజంత్రీలు ఎందుకన్నట్లు ఇంకెక్కడి ఆదర్శమండీ. అదంతా గతం. ముందున్నది మన అసలు జీవితం..ఏవంటారు!''

వెంకటాచలం చలనం లేకుండా అరుణ కౌగిలిలో అలాగే బిగుసుకుపోయాడు. ★